క్లుప్తంగా

సాంబశివరావు జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

తిరుమలగిరి : ఉద్యమాల ఉపాధ్యాయుడు, దళిత బహుజన మేధావి సాంబశివరావు 72వ జయంతి వేడుకలను తిరుమలగిరిలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య, పత్తెపురం యాదగిరి, సైదులు, సోమన్న, రాజు, వెంకన్న, రమేష్, యాదగిరి, బుచ్చిబాబు, కందుకూరి సోమయ్య, వెంకన్న, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరేష్

భానుపురి : ఆమ్ ఆద్మీ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూర్యాపేట ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కల్లేపల్లి నరేష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్లో సూర్యాపేట నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా పార్లమెంటరీ కన్వీనర్ ఎండీ అఫ్జల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఢిల్లీలో ప్రతి ఒక్కరికీ కనీస సౌకర్యాలైన ఉచిత విద్య, వైద్యంతోపాటు, పేదలకు ఇళ్ల నిర్మాణం చేసిన ఘనత సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కే దక్కుతుందన్నారు. అనంతరం పట్టణ, మండల నూతన కమిటీని ప్రకటించి వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పార్లమెంటరీ కమిటీ అధ్యక్షుడు మజీద్, తెలంగాణ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ హరి ప్రసాద్ గౌడ్, తెలంగాణ అధికార ప్రతినిధి అబ్దుల్లా, సూర్యాపేట మండల కన్వీనర్ బండ్ల వెంకన్న, కో కన్వీనర్ కొచ్చర్ల ప్రసాద్, ఆత్మకూరు, చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాల కన్వీనర్లు మూస లింగయ్య, కొచ్చర్ల ప్రసాద్, వేల్పుల రాజు, సూర్యాపేట పట్టణ మహిళా అధ్యక్షురాలు చింతమల్ల కళ్యాణి, పట్టణ అధ్యక్షులు బొమ్మిడి జనార్దన్, యూత్ వింగ్ అధ్యక్షుడు నెమ్మికంటి నాగరాజు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



డి.కొత్తపల్లిలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారులు

నాగారం : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని, ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ఆసక్తి చూపాలని ప్రాంతీయ ఉద్యాన అధికారి కన్న జగన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో ఆయిల్‌పాం సాగును పరిశీలించి, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నీటి వసతి ఉన్న రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పాం పంటసాగు చేసుకోవాలన్నారు. ఆయిల్‌పాంకు నికరమైన ధర, మంచి మార్కెట్ సౌకర్యం ఉందని తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వం రాయితీలను అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు గుంటకండ్ల రామచంద్రారెడ్డి, పతాంజలి ఆయిల్ పాం కంపెనీ ప్రతినిధులు వి.శశికుమార్, రంగు ముత్యంరాజు, లక్ష్మీనారాయణ, రైతులు పులుగూరి నరేష్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, గైగుళ్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

మద్దిరాల : మండల పరిధిలోని జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాషబోయిన పరశురాములుతో పాటు మరికొంత గ్రామశాఖ అధ్యక్షుడు వెంకటనర్సింహారావు ఆధ్వర్యంలో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎస్‌ఏ.రజాక్, జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, జలకర్ర చంద్రమౌళి, బొబ్బిలి ఉప్పలయ్య, ఉపసర్పంచ్ మురారి జనార్దన్, రాజేంద్రప్రసాద్, నర్సింహారెడ్డి, కమటం రామస్వామి, రామచంద్రయ్య, కమటం వెంకన్న, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎస్‌ఏ.రజాక్

ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేలా..

- దండుమైసమ్మ ఆలయం వద్ద కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్లులో ఉన్న దండుమైసమ్మ ఆలయం వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. దండుమైసమ్మ ఆలయం సూర్యాపేట–దంతాలపల్లి రహదారిని ఆనుకొని ఉండడం, ఈ రహదారిపై వాహనాల రద్దీ అధికంగా ఉండడం, ప్రతి ఆది, గురు, శుక్రవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. నూతన వాహనాలు కొనుగోలు చేసిన భక్తులు వాహన పూజ సమయంలో రోడ్డు మీదనే వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. దీంతో భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రూ.4 కోట్ల 65 లక్షలతో పనులు..

ట్రాఫిక్ సమస్య పరిష్కరించడం కోసం రూ.4 కోట్ల 65 లక్షలతో దండుమైసమ్మ ఆలయానికి ఇరువైపుల కలిపి 700 మీటర్ల మేర సీసీ రోడ్డు, బీటీ రోడ్డుతో 100 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపట్టడానికి ఆర్ అండ్ బీ అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. ఆలయం సమీపంలోని దుకాణాలను ఇప్పటికే వెనకకు జరిపి రోడ్డు నిర్మాణం చేపట్టగా పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆలయం వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దండు మైసమ్మ దేవాలయం వద్ద సీసీ రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలు

ఇష్టారీతిన పనులు..

దండుమైసమ్మ ఆలయం వద్ద రోడ్డు విస్తరణ జరిగితే ట్రాఫిక్ సమస్య ఉండదని భక్తులు హర్షం వ్యక్తం చేస్తుండగా అక్కడ జరిగే పనులతో పలువురు భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపుల ఉన్న పెద్దపెద్ద చెట్లను తొలగిస్తున్నారు. కాగా ఆలయం సమీపంలో కరెంటు స్తంభాలను తొలగించకుండా అలాగే ఉంచి రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో రోడ్డు నిర్మాణానికి చెట్లు అడ్డంకిగా ఉన్నాయి గాని కరెంటు స్తంభాలు అడ్డురావా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే గుత్తేదారులు తమ ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారని వారు అంటున్నారు. ఇప్పటికైనా రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను వెంటనే తొలగించి భక్తులకు ఇబ్బంది కలుగకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని భక్తులు, గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.



తొలగించిన రోడ్డు వెంబడి చెట్లు

ట్రాఫిక్ సమస్య తీరుతుంది



గతంలో దేవాలయానికి ఆనుకొని రోడ్డు ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఉండేది. దీంతో భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్య తీరుతుంది. దేవాలయానికి వచ్చే భక్తులు పూజలు, వాహన పూజలు సక్రమంగా నిర్వహించవచ్చు.

– వేల్పుల వెంకన్న, మాజీ ధర్మకర్త

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో..



దండు మైసమ్మ దేవాలయం వద్ద రోడ్డు విస్తరణ చేయడం సంతోషదాయకమే. కానీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు తమ ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారు. దేవాలయానికి ఎదురుగా కరెంటు స్తంభాలు అలానే ఉంచి సీసీ రోడ్డు నిర్మించారు. ఇలా ఉంటే మళ్లీ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. అధికారులు వెంటనే స్తంభాలను తీసివేయాలి.

– దండా వెంకటరెడ్డి, గ్రామస్తుడు

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే ఎజెండా

పెన్‌పహాడ్ : రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే ప్రధాన ఎజెండాగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. సోమవారం సింగారెడ్డిపాలెం, అనంతారం, పొట్లపహాడ్, అన్నారం బ్రిడ్జి, నాగులపాటి అన్నారం, నారాయణగూడెం, నాగులపహాడ్, దోసపహాడ్, అనాజిపురం గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు కోటి 85లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, దోసపహాడ్‌లో గ్రామ పంచాయతీ కార్యాలయాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనంతరం నాగులపహాడ్‌లోని శ్రీ త్రికుటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య, పీఏసీఎస్ చైర్మన్‌లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, రైతు విభాగం మండల అధ్యక్షుడు గుర్రం అమృతారెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ సంకరమద్ది నిరంజన్‌రెడ్డి, సర్పంచ్‌లు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, షరీఫుద్దీన్, రమణ, రామినేని పుష్పావతి, ధనియాకుల కోటమ్మ, మండలి మల్లయ్య, రాయిలి లక్ష్మి, దొంగరి సుధాకర్, ఎంపీటీసీ మామిడి రేవతి, సైదమ్మ పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : అనంతారంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

మహాప్రస్థానం పనుల పరిశీలన

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలోని మహాప్రస్థానంలో జరుగుతున్న తుదిదశ పనులను సోమవారం సాయంత్రం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పరిశీలించారు. మహాప్రస్థానం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : నాగులపహాడ్ శ్రీ త్రికుటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి



సూర్యాపేట : మహాప్రస్థానం పనులను పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

విభిన్న సంస్కృతులకు నిలయం భారతదేశం



చర్చిని ప్రారంభించి కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే

తుంగతుర్తి : విభిన్న సంస్కృతులు, మతాలకు నిలయం భారతదేశం అని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన న్యూ హోప్ ప్రెస్బిటేరియన్ చర్చిని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని, తోటివారికి సేవ చేసే గుణం అలవర్చుకోవాలన్నారు. గ్రామాల్లో చర్చిల నిర్మాణాలతో ప్రజల్లో ఐక్యత భావం ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం తుంగతుర్తిలోని సీఎస్ఐ చర్చి 18వ వార్షికోత్సవంలో పాల్గొని, కేక్‌కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే తుంగతుర్తిలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రాస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న స్వామి వారి కళ్యాణ మండపాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములుగౌడ్, ఎంపీటీసీ సృజనపరమేష్, కటకం వెంకటేశ్వర్లు, పులుసు యాదగిరి, రమేష్, ముత్యాల వెంకన్న, రవికుమార్, వెంకన్న, చర్చి పాస్టర్లు యాకోబ్, దాసం జయరాజ్, ప్రభాకర్, ప్రకాశ్, చంద్రశేఖర్, శ్యాంసన్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

మండల పరిధిలోని సంగెం గ్రామ సర్పంచ్ ఏశమల్ల సుశీల భర్త ఏశమల్ల సామేలు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో సోమవారం స్థానిక ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ బాధితుడిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములుగౌడ్, ఏశమల్ల సృజన్, పులుసు యాదగిరి, మల్యాల రాములు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు



నుజ్జునుజ్జయిన కారు ముందుభాగం

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలోని ఫాతీమా స్కూల్ సమీపంలో జనగామ రోడ్డు నుంచి వస్తున్న కారు ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టింది. ఈ సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకోగా, కారులోని వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన వీరబ్రహ్మం కారులో ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేటకు వెళ్లి వస్తున్నాడు. నిద్ర మత్తులో ఉన్న అతడు ఫాతీమా స్కూల్ సమీపంలో ఆగి ఉన్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టాడు. కారులో ఉన్న ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పి వీరబ్రహ్మంకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

విద్యార్థులను పట్టించుకోని కాలేజీ యాజమాన్యం

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలో భవిత ఇంటర్మీడియట్ కళాశాల యాజమాన్యం విద్యార్థులను పట్టించుకోవడంలేదని, గోడ కూలి 13 మంది విద్యార్థులకు గాయాలైన కనీసం వారిని పరామర్శించడానికి కూడా రాలేదని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. సోమవారం భవిత కళాశాల ఎదుట నిరసన తెలిపి, అనంతరం జిల్లా ఇంటర్ బోర్డు అధికారి జానపాటి కృష్ణకి వినతిపత్రం అందజేశారు. కాలేజీ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భారి అశోక్ కుమార్, తగుళ్ల జనార్దన్ యాదవ్, రాంమూర్తి, వికాస్‌రాజ్ పాల్గొన్నారు.

భవిత విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

భవిత విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని జేఏసీ చైర్మన్ సదరపు ప్రసాద్, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు వీరబోయిన లింగయ్య అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆర్‌జేడీకి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వీరన్న, సంతోష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి నాయకులు

పేట కాంగ్రెస్‌కు వెయ్యి ఏనుగుల బలం ఆర్డీఆర్

భానుపురి : ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా, నాలుగు సార్లు ఏఐసీసీ సభ్యుడిగా ప్రజలకు సేవలు అందించిన రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఐదవ సారి ఏఐసీసీ సభ్యుడిగా ఎన్నిక కావడం సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ నాయకులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ అన్నారు. సోమవారం రాత్రి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఏఐసీసీ సభ్యులుగా ఎన్నికల కావడం పట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరెని శ్రీనివాస్ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి స్వీట్లు పంచి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యకర్తలను నాయకులుగా తయారు చేసే ఫ్యాక్టరీ దామోదర్‌రెడ్డి అన్నారు. నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని, రాబోయే ఎన్నికల్లో మనమే గెలవబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుందమల్ల శేఖర్, రుద్రంగి రవి, నరేందర్ నాయుడు, ఆలేటి మాణిక్యం, అక్కినపల్లి జానయ్య, నాగుల వాసు, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, వెన్న మధూకర్ రెడ్డి, పందిరి వెంకన్న, కంభంపాటి మధు, జమాండ్ల సత్యనారాయణ రెడ్డి, గార్లపాటి వెంకటరెడ్డి, ఏలేటి భరత్ రెడ్డి, మహమ్మద్ అలీ, భిక్షం, సంజీవ, వెంకన్న, దైద రవి, వేణు, సతీష్, కరుణాకర్, శంకర్, నోముల వెంకన్న, గుడిపూడి శీను, తదితరులు పాల్గొన్నారు.



బాణసంచా కాలుస్తున్న నాయకులు

ఏఐసీసీ సభ్యుడిగా నియామకంపై హర్షం

అర్వపల్లి : మాజీ మంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు దామోదర్‌రెడ్డి ఏఐసీసీ సభ్యుడిగా నియామకం కావడం పట్ల డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మోరపాక సత్యం, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

అర్వపల్లి : 18ఏళ్లు పైబడి కంటి సమస్యలున్న ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కంటి వెలుగు వైద్యాధికారి డాక్టర్ చినపాక మణిరత్నం కోరారు. కాసర్లపహాడ్‌లో జరుగుతున్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం కంటి పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో 1085 మంది కంటి పరీక్షలకు అర్హులు కాగా ఇప్పటికే 603 మందికి పరీక్షలు చేసి 131 మందికి రీడింగ్ గ్లాసులు అందజేశామని తెలిపారు. 91 మందికి ప్రత్యేక అద్దాల కోసం ఆర్డర్ పెట్టామని చెప్పారు. ఈ నెల 24వరకు గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందని.. గ్రామస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎల్.చరణ్, హెల్త్ అసిస్టెంట్ కుంభం వీరయ్య, ఆప్తమాలజిస్ట్ ఏ.వేణు, ఏఎన్‌ఎం నాగరాణి, కంటి వెలుగు సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో తెలంగాణను కాపాడుకుందాం



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి : అమరుల స్ఫూర్తితో తెలంగాణను కాపాడుకుందామని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు మాండ్ర మల్లయ్య, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్ పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ ఉద్యమ అమరవీరుడు సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎంతోమంది అమరుల త్యాగాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ తన రాజకీయ స్వార్థం కోసం తాకట్టు పెడుతున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంబాలపల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బంధన్ నాయక్, ఎస్టీ సెల్ పట్టణ కన్వీనర్ దేవత సతీశ్, నాయకులు హరీష్, మైనార్టీ నాయకుడు జావిద్, నాగరాజు, ప్రభువు, అశోక్, మురళి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై సమావేశం

మద్దిరాల : వేసవి సీజన్ ప్రారంభం అవుతున్నందున గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి తాగునీటి సమస్య రాకుండా చూడాలని వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ సరోజ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీకాంత్, ఏఈ అఖిల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



చివ్వెంలలోని పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కళారాణి, గోలి శ్రీనివాస్, ఉపాధ్యాయులు గిరి ప్రసాద్, పబ్బతి వెంకటేశ్వర్లు, పరమేష్, ప్రసన్నా కుమార్, సుల్తానా, కవిత పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జెల్లా ప్రసాద్ పాల్గొన్నారు.



చివ్వెంల : తిమ్మాపురంలో ఉపాధ్యాయులు, అధికారుల వేషధారణలో విద్యార్థులు



అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో..

మాయ మాటలతో మోసం చేస్తున్న కేసీఆర్

ఆత్మకూర్(ఎస్) : మాయ మాటల గారడీతో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం నెమ్మికల్‌లో 12వ రోజు పాదయాత్రలో పాల్గొని మాట్లాడారు. తొమ్మిదేళ్లలో మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రజల సమస్యలను ఏనాడు కూడా తెలుసుకోలేదన్నారు. టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ అతని తొత్తు జగదీశ్ రెడ్డి మాత్రమే బాగుపడ్డారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే కాంగ్రెస్ పార్టీ పక్షాన పాదయాత్ర చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలుముల గోపాల్ రెడ్డి, నాయకులు స్వామి నాయుడు, షఫీఉల్లా, దండ అరవింద్ రెడ్డి, మల్సూర్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లింగయ్య, కరుణాకర్ రెడ్డి, సైదులు, లక్ష్మీనర్సు, చంద్రయ్య, షఫీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

ఇబ్బందులకు గురి చేయొద్దు



మాట్లాడుతున్న కడెం లింగయ్య

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి విద్యుత్ కోతలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. సోమవారం తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతుంటే ఆటోమెటిక్ స్టార్టర్లు తీసివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తొలగించిన స్టార్టర్లను బిగించి నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య, రైతు సంఘం నాయకులు కడారి లింగయ్య, కార్మిక సంఘం అధ్యక్షులు నీర్మాల యాకయ్య, సోమిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

తిరుమలగిరి : షుగర్, అధిక రక్తపోటు విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించాలని, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, మున్సిపల్ వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి కోరారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శాఖ ఆధ్వర్యంలో తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు తొండ గ్రామంలో ఆరోగ్య కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. వైద్యులు సూచించిన విధంగా మందులు క్రమం తప్పకుండా వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి మల్లెల వందన, సీహెచ్‌ఓ బిచ్చు నాయక్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య కిట్లు పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్

విద్యుత్ పొదుపునకు సహకరించాలి

నూతనకల్ : విద్యుత్ పొదుపునకు రైతులు సహకరించాలని ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్ రైతులను కోరారు. సోమవారం మండల పరిధిలోని ఎర్రపహాడ్, దిర్శనపల్లి గ్రామాల్లో వ్యవసాయ రంగానికి వినియోగిస్తున్న ఆటోమెటిక్ స్టార్టర్‌లను విద్యుత్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించాలనే లక్ష్యంతో, విద్యుత్ వృథాను అరికట్టడంలో భాగంగానే స్టార్టర్లను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ సీహెచ్ నాగార్జున, ఆర్టిజన్ లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించాలి

నాగారం : వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నందున రైతులు తమ వ్యవసాయ పంప్ సెట్‌లకు అమర్చిన ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించాలని మండల విద్యుత్‌శాఖ ఏఈఈ మహేంద్ర కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి సెక్షన్ 6 ప్రకారం ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తున్న క్రమంలో కరెంటు ఇబ్బంది లేనందున, ఆటోమెటిక్ స్టార్టర్లతో పనిలేదన్నారు. ఆటోమెటిక్ స్టార్టర్ల తొలగింపుతో విద్యుత్ వృథాను అరికట్టడమే కాకుండా, విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గుతుందని తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోదాడరూరల్ : మండలంలోని గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఎంపీపీ చింత కవితా రాధారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుడిబండలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ.సలీం, ఆత్కూరి శేషు, రఫీ, నాగేశ్వరరావు, శ్రీను తదితరులు ఉన్నారు.

అనాలోచిత నిర్ణయం.. వికలాంగులకు ఇబ్బంది

దురాజ్‌పల్లి : ప్రజావాణిలో వినతులు ఇచ్చేందుకు జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు వచ్చిన వికలాంగులు ఇబ్బందులు పడ్డారు. కలెక్టరేట్‌కు వచ్చే అధికారుల వాహనాలు మినహా ఇతర వాహనాలు లోనికి రాకుండా కలెక్టరేట్ భవన సముదాయానికి కొద్ది దూరంలో స్టాపర్లను ఏర్పాటు చేశారు. పోలీసులు ఈ స్టాపర్లను దాటి వికలాంగుల వాహనాలను అనుమతించకపోవడంతో కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు వారు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వికలాంగుల వాహనాలను అనుమతించకపోవడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.



కలెక్టరేట్ నుంచి నడిచి వస్తున్న దివ్యాంగులు